క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఓబులవారిపల్లె : నేడు మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ చీరల నాగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

8న పుల్లంపేట మండల సమావేశం

పుల్లంపేట : ఈనెల 8వ తేది శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, మండల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

నుండుపల్లె : రాయవరం ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కడప సాయి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కంటి లోపాలు ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు కంటి శుక్లాలు ఉండి ఆపరేషన్లకు ఎంపికైన వారిని కడప ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి వారు కోరారు. ఆధార్ కార్డు తప్పక తమవెంట తీసుకురావాలని వారు తెలిపారు.

అన్నదానం

రామాపురం : ప్రేమాలయం వృద్దుల ఆశ్రమంలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన కలమల మౌలాలి జ్ఞాపకార్థంగా కుమారుడు మౌలాలి (చిన్న) ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాత కుటంబ సభ్యులు హసీనా, సారా, సనా, క్లబ్ అధ్యక్షులు లయన్ శివారెడ్డి, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

నుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు కురవపల్లికి చెందిన బెల్లాల రమణయ్య(52) గత గురువారం నుంచి కనిపించడం లేదని అతని కుమార్తె కామిని అంజనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే బెల్లాల రమణయ్య గురువారం చంద్రాజుగారిపల్లికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడని తరువాత ఆ పల్లెలో తెలిసిన వారిని విచారించగా అక్కడికి రాలేదని చెప్పారన్నారు. బంధువుమిత్రులను అడుగగా అక్కడికి కూడా ఆయన వెళ్లలేదని తెలపడంతో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

లక్కిరెడ్డిపల్లి : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు. సోమవారం రాయచోటి - వేంపల్లి మార్గంలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని, హెల్మెట్ ధరించడం వలన తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాం ప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

రాజంపేట రూరల్ : పట్టణంలోని ఎస్వీ నగర్‌లో ఆదివారం వేకువజామున తన ఎరుపు రంగు పల్సర్ బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు ఎ.బాలక్రిష్ణ సోమవారం తెలిపారు. విద్యుత్‌శాఖలో పని చేస్తున్న తాను తన విధులు ముగించుకొని శనివారం తన ఏపీ04బీసీ8081 నెంబరు గల ద్విచక్రవాహనంను తన ఇంటి ముందు ఉంచామన్నారు. ఆదివారం ఉదయం లేచి చూడక బైక్ కనిపించకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు.

11న మగ్దూం బాబా ఉరుసు



ఉరుసుకు ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిని ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

నందలూరు : మండల కేంద్రమైన నందలూరులోని మగ్దూం బాబా దర్గాలో ఈనెల 11న ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు చిన్న పీఠాధిపతి హైదర్ సాహెబ్ తెలిపారు. ఉరుసు మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆయన సోమవారం రాజ్యసభ సభ్యులు రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి, సిద్దవటం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మేడా మధుసూదన్‌రెడ్డి, మేడా కుటుంబీకులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. 10న గంధం, 11న ఉరుసు ఉంటుందని తెలియజేశారు.

బహుమతుల ప్రదానం

సిద్దవటం : విద్యార్థులు సృజనాత్మక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సిద్దవటం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీరాములు, ఏకలవ్య ఫౌండేషన్ విద్యా కో-ఆర్డినేటర్ సుదర్శన్‌లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ విద్యార్థులకు అక్టోబర్ నెలలో వక్తృత్వ పోటీలను నిర్వహించారన్నారు. అంతే గాకుండా ఇంటింటి పరిశుభ్రత అనే అంశంపై సర్వే నిర్వహించి ఉత్తమ అభిప్రాయం తెలిపిన వారికి బహుమతులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోతుల బెడద.. తీరేదెట్టా!

- శునకాలు, కోతులతో అల్లాడిపోతున్న మండలవాసులు
- వాటి బారినుంచి తమను రక్షించాలంటూ అధికారులకు వేడుకోలు



వీధుల్లో గుంపులుగా ఉన్న సంచరిస్తున్న కుక్కలు



విద్యుత్ తీగలపై స్వైరవిహారం చేస్తున్న కోతులు

చిట్వేలి : మండలంలో కోతుల బెడద పరిష్కరించలేని సమస్యగా మిగిలింది. అవిచేసే కోతి చేష్టలతో ప్రజలు విసిగిపోయి ఏమిచేయలేని స్థితిలో అష్టకష్టాలు పడుతున్నారు. కోతులు గుంపులుగా తిరుగుతూ విద్యుత్ వైర్లపై నడుస్తూ సర్వీసు వైర్లను, డిష్ వైర్లను తెంచుతూ ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయి. అలాగే గృహాల్లోకి దూరి నానా బీభత్సవం సృష్టిస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పల్లె ప్రాంతాలలో ప్రజలు పెరటితోటలు పెంచుకుంటూ కావాల్సిన కూరగాయలు, ఆకుకూరలను పండించుకొని తినేవారు. అలాగే గృహాల ఆవరణలు పూలమొక్కలతో కళకళలాడుతుండేవి. కోతుల దెబ్బతో పూల మొక్కలు, పెరటితోటలు కనుమరుగయ్యాయి. దీంతో అన్నీ కొని తినాల్సిన దుస్థితి పట్టిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక అవస్థలు పడుతున్న రైతులకు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా కోతుల బెడద తయారయ్యింది. వీటి బెడదను తప్పించుకోవడానికి రైతులు అదనపు ఖర్చులు వెచ్చించాల్సి వస్తోంది. వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలకు కాపలాదారులను పరిస్థితి దాపురించింది. దీనికి ఏడాదికి లక్ష పైచిలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నష్టాల్లో, కష్టాల్లో ఉన్న రైతులకు కోతుల బెడదతో ఇబ్బందిగా మారింది.

గ్రామ సింహాలతో హడలిపోతున్న ప్రజలు..

గ్రామ సింహాలుగా పేరున్న కుక్కల సంగతి పెరిగిపోయి ప్రజల పాలిట శాపంగా మారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి సంతతి ఎక్కువై గుంపులుగా తిరుగుతూ పాఠశాలలకు వెళ్లే పిల్లలను, పాదచారులను, ద్విచక్ర వాహనదారులను హడలెత్తిస్తున్నాయి. కుక్కల సంఖ్య పెరిగిపోయి వీటికి సరిపడా ఆహారం దొరకక బక్క చిక్కి పిచ్చికుక్కలుగా మారి ప్రజలను కరుస్తున్నాయి. సరిపడా వ్యాక్సిన్ అందుబాటులో లేక కుక్క కాటుకు గురైన వారు అష్టకష్టాలు పడుతున్నారు. మొత్తం మీద అటు కోతులు, ఇటు కుక్కలతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పంచాయతీవారు, సంబంధిత అధికారులు వీటి బెడద నుంచి తమను కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కుక్కల బెడదను తప్పించండి



గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న కుక్కల బెడదను తప్పించండి. పాదచారులను, ద్విచక్రవాహనదారులను తరిమి ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. చిన్నపిల్లల పాలిట యమదూతలుగా మారిన కుక్కలను నిర్మూలించాలి.

– గాడి ఇంతియాజ్ అహ్మద్, హెల్ప్‌లైన్ సొసైటీ కార్యదర్శి, చిట్వేలి

కోతుల సమస్యను పరిష్కరించండి



కోతుల ఆగడాలను భరించలేకున్నాం. అందరికీ సమస్యగా మారిన కోతుల బెడదను అధికారులు పరిష్కరించాలి. వీటి సంతతి నానాటికి పెరిగిపోతూ అందరికీ సమస్యగా మారాయి. పొలాల వద్ద వీటి కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు చేపట్టి కోతుల బెడద తప్పించాలి.

– మన్నూరు సుధీర్ రెడ్డి, రైతు, మార్గోపల్లి

మా కుటుంబాన్ని ఆదుకోండి.. సారూ



తన కుటుంబ ధీనావస్థను తెలియజేస్తున్న లావణ్య

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో భర్తను పోగొట్టుకోవడంతో కుటుంబం రోడ్డున పడిందని తమను ఆదుకోవాలని ఓ మహిళ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను విజ్ఞప్తి చేసింది. వివరాలు.. వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టణం పార్వతీపురానికి చెందిన లావణ్య సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌కు వచ్చింది. ఈ ఏడాది మార్చి 3న రాయచోటి ఏజీ గార్డెన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తన భర్తను కోల్పోయానని, దీంతో కుటుంబ భారం తనపై పడిందన్నారు. తనకు ఒక కుమార్తె, దివ్యాంగుడైన కుమారుడు, వృద్ధాప్యంలో ఉన్న అత్త ఉన్నారని చెప్పారు. ఒక్కదానినే కుటుంబం పోషించడం భారంగా మారిందని, తన భర్త రోడ్డు ప్రమాదంలో మరణానికి కారణమైన ఆది వెంకటేశ్వర్లు నుంచి తన ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవడమే కాక ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజాస్వామ్యంపై అవగాహన అవసరం

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో దేశ్‌అప్నా ఏ సహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరవ తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్యం గొప్పతనం, రాజ్యసాధనలో పౌరుల పాత్ర, ఎన్నికలు, ప్రాథమిక హక్కులు విధులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే భావి భారత నిర్మాతలు కాబట్టి రాబోయే జీవితం మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత నేటి బాలలదేనన్నారు. ప్రజాస్వామ్యం గురించి అవగాహన కల్పించడం చాలా మంచిదన్నారు.

టార్పాలిన్ పట్టలు పంపిణీ



రైతులకు పట్టలు అందజేస్తున్న అధికారులు

వీరబల్లి : టార్పాలిన్ పట్టలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వెలుగు కో-ఆర్డినేటర్ ఖాదర్ వలీ కోరారు. సోమవారం మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో పట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన 18కి 24సైజు గల పట్ట ధర రూ.1650లకు అందజేస్తున్నామన్నారు. ఆసక్తిగల రైతులు మీ పరిధిలోని రైతు మిత్రలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీజీసీ గంగాధరం, రైతు మిత్రలు జనమేజయుడు, వెంకటేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులను అందుకున్న విద్యార్థులు

పెనగలూరు : మండలంలోని చక్రంపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా దుస్తులను ఆ పాఠశాల పూర్వపు విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు రూ. 15 వేలు విలువచేసే దుస్తులను అందజేశారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన సానియా, సర్వజ్ఞలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు హరిప్రసాద్, కృష్ణకుమారి, శ్రీవాణి, పరిమళ, నరసింహులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ

- భక్తిశ్రద్ధలతో త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణ
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు



రాయచోటి టౌన్: పల్లకీలో ఊరేగుతున్న వీరభద్రుడు



పుల్లంపేట: అలంకారంలో శాంతిలింగేశ్వరస్వామి



చిన్నమండెం: దర్శనమిస్తున్న పరమశివుడు

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి మొదట కార్తీక సోమవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో అధిక సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. మండల పరిధిలోని అత్తిరాలలో సోమవారం రాత్రి గిరిప్రదక్షిణను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రేతేశ్వరునికి మొక్కులు చెల్లించి ప్రారంభించారు. ముందుగా బహుదానదికి గంగా హారతి అందించారు. కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని నూతనంగా తయారు చేయించిన రథంలో కొలువుదీర్చారు. స్వామి వారి రథంను భక్తులు లాగుతూ భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన ఈ ప్రదక్షణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో కొనసాగింది. గిరి ప్రదక్షిణ భక్త మండలి ఆధ్వర్యంలో అన్నప్రసాదంను అందజేశారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది.

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో కొలువైన శివాలయాల్లో సోమవారం భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ప్రధానంగా మోటకట్ల వెంకటశివసాయి ఆలయం, సంబేపల్లె శ్రీ గుహేశ్వరి పశుపతినాథ ఆలయం, చిన్నజంగంగపల్లె మల్లికార్జున ఆలయాలలతో పాటు పలు ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

చిట్వేలి : కార్తీకమాసంలో మొదటిరోజు సోమవారం శివనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని దీపాలు వెలిగించారు. స్థానిక శ్రీ శ్యామలాంభ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిపారు. శ్యామలాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నల్లకపల్లి శ్రీభవాణీ శంకరస్వామి ఆలయం, పాత చిట్వేలిలో వెలసి ఉన్న శ్రీభద్రకాళి వీరభద్రుడు ఆలయం, గుండాలకోన, మూలరోడ్డు శివాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో ఆయా గ్రామాల శివార్లలోని శివాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

రాజంపేట టౌన్ : కార్తీక తొలి సోమవారాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలోని శివాలయాలకు, శైవక్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో ఆయా ఆలయాల్లో వేకువ జాము నుంచే భక్తుల సందడి కనిపించింది. కాగా శివాలయాల్లో, శైవక్షేత్రాల్లో కొలువుదీరిన స్వామి వారి మూలవిరాట్‌లను శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన స్వామివారిని భక్తులు దర్శించుకొని తరించారు. మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి దీపాలను వెలిగించారు.

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామ సమీపంలో ఉన్న జ్యోతి సిద్దవటేశ్వరస్వామి ఆలయం, సిద్దవటంలోని సిద్దవటేశ్వర ఆలయం, కపర్థీశ్వరస్వామి ఆలయం, కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీ ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి అష్టోత్తర(108) శివలింగాలు మహా లింగేశ్వర స్వామి ఆలయంలో, శ్రీ నిత్యపూజస్వామి ఆలయంలో తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

పెనగలూరు : మండలంలోని చక్రంపేట బ్రహ్మంగారి గుడి సమీపంలో ఉన్న కాశినాయన ఆలయంలో సోమవారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చక్రంపేటకు చెందిన మాజీ సర్పంచ్ ఆంజనేయ రెడ్డి, సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ఆకేపాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుల్లంపేట: కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధినీ శాంతిలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

రాయచోటి టౌన్ : కార్తీక మొదటి సోమవారం కావడంతో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ అఘోర లింగేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అలానే సోమవారం రాత్రి శ్రీ భద్రకాళీ సమేతుడు పల్లకీలో ఊరేగారు. ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు.



పెనగలూరు: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



సిద్దవటం: శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



సంబేపల్లె: అలంకారంలో పశుపతినాథుడు



చిట్వేలి: విశేష అలంకారంలో శ్యామలాంబ అమ్మవారు



రాజంపేట రూరల్: అత్తిరాలలో రథోత్సవంలో భక్తులు

పకడ్బందీగా స్కిల్ సెన్సస్ చేపట్టాలి



చిన్నమండెం: మాట్లాడుతున్న అధికారిణి

చిన్నమండెం : నైపుణ్య గణన-2024పై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దివ్య మాట్లాడుతూ సర్వేలో 15 నుండి 59 సంవత్సరాల వయస్సు గల వారి నుండి సమగ్ర డేటాను తీసుకోవాలన్నారు. దీని ద్వారా ప్రాంతీయ ఇండస్ట్రీకి అనుగుణంగా, ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శేఖర్‌నాయక్, టీటీటీస్ పీఎస్ రేఖ, శ్వేత, స్కిల్ సెన్సస్ కో-ఆర్డినేటర్, ట్రైనర్ శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సోమవారం స్కిల్ సెన్సస్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణా తరగతులు నిర్వహించామని ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ యాస్మిన్, స్కిల్ సెన్సస్ కోఆర్డినేటర్ సౌజన్య, మండలంలోని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవను అమలు చేయండి

లక్కిరెడ్డిపల్లి : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు అన్నదానత సుఖీభవ కింద రూ. 20 వేలు రైతుల ఖాతాలలో జమ చేస్తామని చెప్పి ఇంకా జమ చేయలేదని, వెంటనే రైతుల ఖాతాలలో నగదు జమ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లిలోని సచివాలయాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓలకు ఆయన వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో భాగంగా పంట నష్టపోయిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాలలో రూ. 20 వేలు జమ చేస్తామని కూటమి ప్రభుత్వం హామి ఇచ్చిందని గుర్తు చేశారు. వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం రైతులు రబీకి తమ పొలాలలో దుక్కులు చేసి సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం వెంటనే విత్తనాలు అందించాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న జిల్లా వ్యాప్తంగా వినతిపత్రాలు సమర్పించి 20న గ్రామ సచివాలయాల వద్ద నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, షబ్బీర్ మహబూబ్ బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే పేస్కేల్ అమలుచేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న వీఆర్‌ఏలు

రాయచోటి అర్బన్ : వీఆర్‌ఏలకు తక్షణమే పేస్కేల్‌ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో వీఆర్‌ఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించిన అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలు గత మూడు దశాబ్దాలుగా అరకొర వేతనాలతో పని చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి నడుమ వారధిగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న జీతాలు చాలనప్పటికీ, 8 సంవత్సరాలుగా జీతాలను పెంచప్పటికీ వీఆర్‌ఏలు అప్పులతో జీవితాలను నెట్టుకొస్తున్న గ్రామసేవకులకు పేస్కేల్ అమలు చేయాలన్న ఆలోచన రాకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే వీఆర్‌ఏలకు రూ. 26 వేల వేతనాన్ని చెల్లించాలన్నారు. అర్హులను వాచ్‌మెన్‌లు, అటెండర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, వీఆర్‌ఓలు తదితరులుగా ప్రమోషన్ ఇవ్వాలంటూ కోరారు. అర్హులైన వీఆర్‌ఓలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు నరసింహులు, అల్లాబకాష్, నాగరాజు, మధు, సుధాకర్, ఎస్.రమణ, రామచంద్ర, మల్లికార్జున, రెడ్డెయ్య శంకర్, మక్బుల్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల ఉచ్చులో పడకండి



మాట్లాడుతున్న జిల్లా అధికారి నాగభూషణం

రామాపురం : మండల పరిధి బండపల్లె పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం డ్రగ్ అడిక్షన్ అండ్ ఎబ్యూజ్ అనే అంశంపై విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం కడప సంస్థ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా టూరిజం అధికారి నాగభూషణం హాజరై మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల వ్యసనం, దుర్వినియోగం సమస్యల గురించి అవగాహన పొందాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర ఏపీఎస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఆకర్షితులై ఆ ఉచ్చులో చిక్కుకూడదని సూచించారు. దేశానికి ఉపయోగకరమైన నిపుణులుగా మారడానికి బాధ్యతాయుతంగా నడుచుకొని విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో వి.ఆర్.పాఠశాల వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర రావు, ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలియజేశారు. సోమవారం మండలంలోని మద్దిరేవుల గ్రామం, ఎస్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ ఆర్డీటీ (మలేరియా) రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి జయచంద్ర, వైద్యులు నజియా, మెహతాజ్, సిబ్బందితో కలిసి గ్రామంలో జ్వరాలపై అవగాహన కల్పించారు.

విద్యాసామగ్రి వితరణ

పుల్లంపేట : ఉపాధ్యాయుడు రమణ మండలంలోని ఉడుమువారిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తాను మొదటగా పనిచేసిన పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.